ప్రజాశక్తి

సోమవారం 30 జనవరి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఆ మాట.. నీటిమూట..

- నేటికీ సాకారమవ్వని వరికపూడిశెల ప్రాజెక్టు
- నాడు ప్రతిపక్ష నేతగా వినుకొండలో హామీనిచ్చిన జగన్

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ ప్రాంతాన్ని దశాబ్ధాలుగా పట్టిపీడిస్తున్న తాగు, సాగునీటి సమస్య పరిష్కారం నేతల హామీలకు పరిమితమవుతోంది. నాయకుల మాటలు నమ్మి జనం ఓట్లు వేస్తుండగా.. ప్రజలకు నాయకులు చెబుతున్న మాటలు ఎప్పటికప్పుడు నీటి మూటలు అవుతున్నాయి. 2019 ఎన్నికలకు ముందు వినుకొండకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డి స్థానిక కారంపూడి రోడ్డులో ప్రసంగిస్తూ అనేక హామీలు గుప్పించారు. వినకొండ ప్రాంతానికి దగ్గరగా నాగార్జునసాగర్ కాల్వ ఉన్నా ఇక్కడి ప్రజలు పడుతున్న నీటి ఇబ్బందులు వర్ణనాతీతమని, ఈ కష్టాలను చంద్రబాబు తీర్చలేకపోయారని విమర్శలు గుప్పించారు. వైసిపి అధికారంలోకి వరికపూడిశెల నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత ప్రజలకు శాశ్వతంగా సాగునీటితో పాటు తాగునీటి కష్టాలను దూరం చేస్తామని వాగ్దాఆనం చేశారు. వినుకొండ పట్టణానికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పద్ధతికి స్వస్థి చెప్పి శాశ్వత తాగునీటి పథకం తెస్తామని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ తాగునీటి సౌకర్యం కల్పించడానికి నిధులిస్తామని ప్రకటించారు. నూజెండ్ల మండలం గుండ్లకమ్మ నదిపై తంగిరాల డ్యామ్ నిర్మిస్తామన్నారు. అయితే సమస్యలు నేటికీ వెక్కిరిస్తూనే ఉన్నాయి. 80 వేల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే వరికపూడిశల ప్రాజెక్టు గాడిన పడలేదు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1270 కోట్లు కేటాయించారనే ప్రచారం మాత్రం చేసుకుంటున్నారు. ఈ ప్రాజెక్టుకు గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు రూ.156 కోట్లు, చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు రూ.340 కోట్లు కేటాయించి కాగితాలకే పరిమితం చేశారు. ప్రస్తుతమూ నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం చెబుతున్నా ప్రాజెక్టు నిర్మాణానికి అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు అవసరమని చెబుతున్నారు. కేంద్ర పెద్దలతో తరచుగా కలిసే నేతలు వరికపొడిసెల ప్రాజెక్టుకు అనుమతులు ఎందుకు తేలేకపోతున్నారు? అనే ప్రశ్నలు వస్తున్నాయి. పల్నాడు జిల్లాకు కీలకమైన ఈ ప్రాజెక్టుపై సిఎం జగన్ సోమవారం నాటి సభలో ఏం మాట్లాడతారని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ప్రతిపక్ష నేతగా వినుకొండలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

గుంటూరు సదస్సులో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

హక్కుల కోసం తరలి రండి

- గుంటూరు, నరసరావుపేటలో సదస్సుల్లో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య
- ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ జయప్రదానికి కార్మిక, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపు
- పలు సమస్యలపై తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

ప్రజా సంపదనంతా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచిపెడుతోందని, ప్రజలపై పన్నుల భారం మోపుతోందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ జయప్రదం కోసం ప్రజా సంఘాల సదస్సులు పాతగుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షవర్గంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరరావు వ్యవహరించారు. నరసరావుపేటలో సదస్సుకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ కొన్ని దశాబ్ధాలుగా దేశప్రజలు నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను, కోట్లాది మంది పైసాపైసా కూడబెట్టుకున్న ఎల్ఐసిని, ప్రభుత్వ బ్యాంకులను, ప్రపంచంలోనే అతి పెద్దదిగా పేరుగాంచిన రైల్వేను, చివరికి విద్యార్థులు ఆడుకునే మైదానాల వరకు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి కేంద్రం బరితెగించిందన్నారు. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మేయాలని చూస్తోందని, రాజ్యాంగానికే పెనుప్రమాదం పొంచి ఉందని, దేశ యువత భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో ప్రభుత్వాల విధానల ఫలితంగా రైతులు, కౌలురైతులకు అప్పులే మిగిలాయని, పలువురు ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. అప్పుల బాధ తాళలేక పల్నాడు జిల్లాలోనే ఈ ఏడాది 50 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న లక్షల మందితో దేశరాజధాని ఢిల్లీలో చేపట్టిన మహాసంఘర్షణ ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత కోసం, నూటికి 60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, కౌలు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం, అధిక ధరలు, దళితులు, మైనార్టీలు, మహిళలపై జరగుతున్న మతోన్మాదదాడులకు వ్యతిరేకంగా, పోలవరం ప్రాజెక్ట్ నిధుల కోసం, కడప స్టీల్ సాధన కోసం నాలుగు సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమం చేపట్టామన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ కేంద్రం 4 లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల రక్త మాంసాలను హరించివేస్తోందని ▶ 2లో

పోలీస్‌స్టేషన్‌కు రైతులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని రెంటపాళ్ల యూనియన్ బ్యాంక్‌కు బ్రాంచీలో బంగారాన్ని తనఖా పెట్టిన ఖాతాదారులు రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగారం మాయమైన ఖాతాదారుల జాబితా బహిర్గతమైన నేపథ్యంలో రైతులు తనఖా పెట్టిన బంగారానికి, జాబితాలోని బంగారానికి వ్యత్యాసం ఉండడంతో పోలీసులను ఆశ్రయించారు. పలువరు రైతులు ఆదివారం సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వారి నుండి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. బ్యాంకులో ఎంత బంగారాన్ని తనఖా పెట్టారు? ఎన్నిసార్లు తనఖా పెట్టి రుణాలు పొందారు? ఎంత మొత్తం లోనుగా తీసుకున్నారు? తదితర వివరాలను బాధితుల స్టేట్‌మెంట్‌గా రికార్డు చేస్తున్నారు.

సత్తెనపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయానికి వచ్చిన బాధిత రైతులు

సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

నేడు వినుకొండకు సిఎం జగన్

- 'జగనన్న చేదోడు' పథకం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమం నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 10 వేల మంది కూర్చునేందుకు వీలుగా సభా ప్రాంగణం

2 లో

200 ఎకరాల్లో మిర్చి యార్డు విస్తరణ

8 లో

- వచ్చే వారం నుంచి ఉచిత భోజనశాల
- 500 మంది రైతులకు వసతి ఏర్పాటు
- ప్రజాశక్తితో చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం

ఒంగోలు జాతి పశువులు గర్వకారణం

- ముగిసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు
- కృష్ణా జిల్లా భక్తుని సుబ్బారావు ఎడ్ల జతకు ప్రథమ స్థానం, రెండో స్థానంలో నక్కా ఆనందబాబు ఎడ్ల జత, కుంచనపల్లి ఎడ్ల జతకు తృతీయస్థానం

6 లో

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 36 వేల మంది పదవ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి జడ్పీ నిధులతో ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించనున్నట్లు జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. ఆమె ఆదివారం జడ్పీ కార్యాలయంలోని తన చాంబర్లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి టెన్త్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు అధికమార్కుల సాధించేందుకు ఇప్పటికే జడ్పీ నుంచి రూ 60 లక్షల నిధులతో జగనన్న విద్యా జ్యోతి స్టడిమెటీరియల్ పంపిణీ చేశామన్నారు. ఖాళీ కడుపులతో సాయంత్రం వేళ అదనపు తరగతులకు హాజరవుతున్న విద్యార్థులను దష్టిలో ఉంచుకుని అల్పాహారం అందించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఇందుకోసం రూ 50 లక్షల పైగా కేటాయించాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 4న జరిగే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అల్పాహారానికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. మూడు జిల్లాల విద్యాశాఖాధికారుల నుంచి విద్యార్థుల వివరాలు తీసుకున్నామని తెలిపారు.

కిరణ్‌ను సత్కరిస్తున్న ఎంపి మోపిదేవి, మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

దాసరి కిరణ్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి తెనాలి

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా నియమితులైన యువ నాయకుడు దాసరి కిరణ్ కుమార్ అభినందన సభ ఆదివారం రాత్రి దాసరి కిరణ్ మిత్రమండలి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. సన్మాన సభలో స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్తో పాటు బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు పాల్గొని కిరణ్ ను అభినందించారు. కిరణ్ కుమార్ మిత్రమండలి షేక్ కాలేషావలి, కుర్రా శ్రీను తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు, కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో సైడ్ కాల్వలకు శంకుస్థాపన

ప్రజాశక్తి- గుంటూరు

తూర్పు నియోజక వర్గం 51వ డివిజన్ శ్రీనగర్ 5,6 లైన్లలలో రూ.2 3లక్షలతో నిర్మించనున్న సైడ్‌కాల్వలకు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ రోడ్లు, తాగునీరు, కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీనగర్‌లో అనేక వీధుల్లో రోడ్లు, కాల్వలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆదేవిధంగా ఇటీవల కాకుమానువారితో నుంచి శ్రీనగర్, శ్రీనగర్‌నుంచి లక్ష్మీపురం వాటర్ రిజర్వాయర్ వరకు తాగు నీటి పైప్ లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంత వాసులు తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయని తెలిపారు. డొంకరోడ్డు నుండి అమరావతి రోడ్డు వరకు ప్రధాన రహదారిని నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 51 వ డివిజన్ వైసిపి ఇన్‌ఛార్జి చెన్నుపాటి వెంకట రమణ, నాయకులు శ్రీనివాసరావు, హైదర్, బుగ్గ శ్రీనివాసరావు, రాజా హుస్సేన్, వెంకట్రావు, మస్తాన్, కె.సుబ్బారెడ్డి, కె.సుబ్బులు, కుమారి పాల్గొన్నారు.

నేడు వినుకొండకు సిఎం జగన్

ప్రజాశక్తి - వినుకొండ

'జగనన్న చేదోడు' పథకం నాలుగో విడత కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని వినుకొండలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వినుకొండకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రానుండగా అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సిఎం హెలిప్యాడ్‌తోపాటు కట్టుదిట్టమైన భద్రత చేపట్టారు. వెల్లటూరు రోడ్‌లోని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రైవేటు స్థలంలో సిఎం సభ ఏర్పాట్లూ పూర్తయ్యాయి. సుమారు పదివేల మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. ప్రధాన వీధుల్లో బ్యారికేడ్‌లు పెట్టారు. సభా ప్రాంగణం వద్ద వాహనాల పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని, పల్నాడు జిల్లా

సిఎం బందోబస్తుపై పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్య బొల్లా బ్రహ్మనాయుడు, జెసి ఎ.శ్యాంప్రసాద్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పరిశీలించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి ప్రజలను తరలించేందుకు బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

438 మందితో బందోబస్తు : ఎస్పీ

అధికారులు, సిబ్బంది అందరూ సమిష్టిగా, సమర్థవంతంగా పని చేసి ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అన్నారు. సిఎం పర్యటన కోసం వివిధ ప్రాంతాల నుండి బందోబస్తు విధులకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమావేశమయ్యారు. ఒక అదనపు ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 9 మంది సీఐలు, 34 మంది ఎస్ఐలు, 115 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 176 మంది కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు మొత్తంగా 438 మందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. వివిఐపిలు, విఐపిలు సంచరించే హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రహదారి వెంట బందోబస్తులో ఉండే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రముఖులకు, ప్రజలకు వేర్వేరుగా కేటాయించిన పార్కింగ్ స్థలాల గురించి వారికి తెలియపరచాలన్నారు. ఎక్కడ ఏ చిన్న అసౌకర్యం కలిగినా ఉన్నతాధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ జి.బిందుమాధవ్, డీఎస్పీలు విజయ భాస్కరరావు, రవిచంద్ర, జయరాం ప్రసాద్, షరీఫుద్దీన్, ఎస్పీ సిఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

హక్కుల కోసం తరలి రండి

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను భిక్షగాళ్లుగా మార్చబూనుకుందని విమర్శించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో వందలాది మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని, దేశ వ్యాప్తంగా వేలాది మందిపై అక్రమంగా కేసులు బనాయించారని చెప్పారు. నల్ల చట్టాలు రద్దు సందర్భంగా కేసులు మాఫి చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ కోట్లాది మంది వ్యవసాయ కార్మికులకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధిహామీ చట్టాన్ని ఉసురు తీయడానికి పూనుకుందని అన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ హక్కులను నిర్వీర్యం చేస్తోందని, రోజురోజుకు దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్రాల హక్కులను హరించివేస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలను ఇవ్వకుండా ఐదు కోట్లమంది ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు తెలపాలని, జిల్లా, మండల స్థాయిలో సదస్సులు

పల్నాడు సదస్సులో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నిర్వహించి గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ ఈ సందేశం తీసుకువెళ్లాలని, సభలు, సమావేశాలు, ప్రచార ర్యాలీలు నిర్వహిచాలని సదస్సులో నిర్ణయించారు.

డిమాండ్స్‌తో కూడిన తీర్మానం ఆమోదం..

కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10 వేలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ పద్ధతి రద్దు చేసి, పర్మినెంట్ ఉద్యోగాల విధానం అమలు చేయాలని, అగ్నిపథ్ రద్దు చేయాలని, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, పేద, మధ్యతరగతి, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఏకకాల రుణమాఫీ చేయాలని, 60 ఏళ్లు నిండిన వారందరికీ పెన్షన్ ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ చట్టం-2022ను రద్దు చేయాలని, రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఉపసంహరించాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని, పోలవరం నిర్మాణ వ్యయం, నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని, కడప ఉక్కును వెంటనే ప్రారంభించాలనే డిమాండ్‌తో తీర్మానాన్ని ఆమోదించారు. 200 రోజుల ఉపాధి హామీ పనిదినాలు, రోజుకు రూ.600లు కనీస వేతనం అమలు చేయాలని, వేతన బకాయిలను చెల్లించాలని, జాతీయ పట్టణ ఉపాధి గ్యారెంటీ చట్టం చేయాలని, భూమిలేని పేద కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలని, భూ సీలింగ్ చట్టం 1973 ను అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సదస్సు డిమాండ్ చేసింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరించడం ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ను రద్దు చేయాలని, ధరలను నియంత్రించాలని, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులపై, పేద రైతులకు ఇచ్చే వ్యవసాయ పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని, ప్రజాపంపిణీని అర్హులందరికీ అమలు చేయాలని, నిత్యావసర సరుకుల్ని రేషన్ దుకాణాల ద్వారా అందించాలని, ఆదాయ పన్ను పరిధిలో లేని కుటుంబాలకు ఆహార భద్రత కల్పించాలని, అటవీ హక్కుల చట్టాన్ని (ఎస్ఆర్ఎ) పటిష్టంగా అమలు చేయాని, గిరిజనుల ప్రమేయం లేకుండా అటవీ భూములు సేకరించటానికి వీలు కల్పించే చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలనే తీర్మానాలను సదస్సు ఆమోదించింది. దళితులు, మహిళలు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలపై అణిచివేతను, హింసను ఆపాలని, సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని, నాణ్యమైన విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి తేవాలని, ఎన్ఇపి-2020ని రద్దు చేయాలని, అర్హులందరికీ పక్కా గృహాలు నిర్మించాలనే డిమాండ్స్‌తో తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

గుంటూరు సదస్సులో 4 సంఘాల జిల్లా నాయకులు కె.లక్ష్మీ,సాంబశివరావు బి.లక్ష్మణరావు, ఎస్ఎస్ చెంగయ్య, ఎన్.శివాజీ, బి.ముత్యాలరావు, ఎం.శివ సాంబిరెడ్డి, ఎం.రవి, వి.దుర్గారావు, షేక్ హుస్సేన్‌వలి, సాంబశివరావు, రామారావు, పి.కృష్ణ, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. నరసరావుపేట సదస్సులో కె.రోశయ్య, ఎ.లలక్ష్మీశ్వర్‌రెడ్డి, వై.రాధాకృష్ణ, కె.రామా రావు, డి.శివకుమారి, కె.హనుమంతరెడ్డి, గుంటూరు విజయకుమార్, ఇ.మస్తాన్‌రెడ్డి, ఎం.హరిబాబు, వి.శివనాగరాణి, జి.బాలకృష్ణ, జి.రవిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మొహం చెల్లకే లోకేశ్‌తో పాదయాత్ర

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వస్తున్నా మీ కోసం పేరుతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నిర్వహించిన పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడం వల్ల ఈసారి లోకేష్‌తో పాదయాత్ర చేయిస్తున్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లో అప్పిరెడ్డి కార్యాలయంలో ఆదివారం నూర్‌బాషా ముస్లిం ములాఖాత్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులుగా మస్తాన్ నియమితులైన సందర్భంగా ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో నూర్‌బాషాలను ముందు వరుసలోకి తెచ్చేందుకు సీఎం కంకణం కట్టుకున్నట్లు చెప్పారు. నూర్‌బాషాలు ఎదుర్కొంటున్న మరికొన్ని సమస్యలు తమ దష్టికి వచ్చాయని, వాటిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. జగన్ సుపరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ ఫలాలు పొందుతున్నారని, ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లలో మూడు సార్లు ముఖ్యమంత్రి పదవి అనుభవించి కూడా ప్రజలకు ఏమాత్రం న్యాయం చేయని వ్యక్తిగా చరిత్ర పుటల్లో నిలిచిపోయారన్నారు. అలాంటి వ్యక్తి తిరిగి ఏ మొహం పెట్టుకుని 2024 ఎన్నికల్లో ఓట్లు వేయమని ప్రజలను అభ్యర్థిస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ, నూర్‌బాషాల స్థితిగతులపై ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు స్పష్టమైన అవగాహన ఉన్నట్లు చెప్పారు. ఈ దేశంలో పుట్టిన వారంతా భారతీయులేనని అన్నారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ

సభలో మాట్లాడుతున్న అప్పిరెడ్డి

గుంటూరు నగరపాలకసంస్థలో నూర్‌బాషాలకు పెద్ద పీట వేసినట్లు చెప్పారు. జిల్లా వక్ఫ్‌బోర్డులో కూడా కీలక స్థానం కల్పించిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, ముస్తఫా మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల జేబులు తడిపితేనే ఏ పనులైనా జరిగేవనీ.. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నూర్‌బాషాల వెనుకబాటుతనానికి పేదరికమే ప్రధాన కారణమని, దాన్ని నిర్మూలించడానికి జగన్ అందరికీ విద్యను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు.

వాహన అద్దాలను పగలగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని గౌతమ్ బుద్ధ రోడ్ లో ఆర్ అండ్ బి బంగ్లా నుండి ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే దారి వరకు రోడ్డు పక్కన ఉన్న వాహనాల అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం ఒంటి గంట ప్రాంతంలో పగలగొట్టారు. ఆటోలు, బైకులు, కార్లు, స్కూల్ బస్సు అద్దాలను స్కూటీపై ఇద్దరు వ్యక్తులు వచ్చి పగలగొట్టినట్లుగా సిసి ఫుటేజీలో గుర్తించారు. బాధితులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వాహనాలను నిర్లక్ష్యంగా రోడ్ల పక్కన పెడితే పగలకొట్టకుండా ఎలా ఉంటారని పోలీసులు ప్రశ్నించారంటూ బాధితులు వాపోయారు. పోలీసులు నైట్ డ్యూటీలో ఉంటూ వాహనాలను పట్టుకోవడానికి ఫైనల్ వేయడానికి శ్రద్ధ ఉంది గాని, వాహనాలు అద్దాలు పగల గొట్టిన వారిని గుర్తించడానికి ఇష్టపడం లేదని చెప్పారు. తాము ప్రశ్నించడంతో ఫిర్యాదు మాత్రం తీసుకున్నారని, విచారణ చేస్తారో లేదోనని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ ఘటనలో లక్షల రూపాయలు విలువైన అద్దాలను పగలగొట్టారు.

రోడ్డు ప్రమాదంలో మంగళగిరి నివాసి మృతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణానికి చెందిన టి.వెంకట్రావు, ఎస్కే సమీర్ శనివారం రాత్రి మంగళగిరి నుండి ఎన్టీఆర్ జిల్లా మీదుగా హైదరాబాద్ కారులో వెళ్తున్నారు. నందిగామ మండలంలోని ఐతవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మంగళగిరి టిప్పర్ల బజారుకి చెందిన సమీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. టి వెంకట్రావు తీవ్రంగా గాయపడి అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

'సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం'

ప్రజాశక్తి-తెనాలి

కోట్లాది రూపాయల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ప్రభుత్వం దారి మళ్లిస్తూ, ఆయా వర్గాల సంక్షేమానికి తూట్లు పొడుస్తోందని జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మనోహర్ నివాసంలో ఆదివారం రాష్ట్ర రెల్లి సమితి నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వంలో కులధృవీకరణ మంజూరుకు సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి రెల్లి సంఘీయులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరటంలేదని వివరించారు. అలాగే కృష్ణ బలిజ సంఘం ప్రతినిధులు కూడా మనోహర్‌ను కలిసి తమను బిసి(డి) జాబితా నుంచి బిసి(ఏ)జాబితాలోకి మార్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి సమస్యలు తీసుకువెళతానని, అవసరమైతే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నేరెళ్ళ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెల్లి సమితి నాయకులు

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి-ఈపూరు



షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని విలువైన గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన మండలంలోని కొండ్రముట్లలో ఆదివారం జరి గింది. గ్రామానికి చెందిన గుజ్జుల సురేష్ రెడ్డి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఎల్ఈడి టివి, ఫ్రిడ్జ్, ఇన్వర్టర్, దుస్తులు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు.

జోడో యాత్రకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, వాటిని కార్పోరేట్లకు కట్టబెడుతున్న మోదీ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. ఏఐసిసి ప్రధాన కార్యదర్శి చేపట్టిన భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. మారీసుపేటలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్తవంతెన, వహాబ్‌రోడ్, బోస్‌రోడ్డు మీదుగ కొనసాగింది. సాంబశివుడు మాట్లా డుతూ ప్రజలపై పన్నుల భారం మోపి, సామాన్యుల మను గడకు కేంద్ర ప్రభుత్వం విఘాతం కలిగి స్తుంటే, దానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా వంతపాడు తోందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్‌కు ప్రజలు అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. పి.నాగసూర్య శశిధర రావు, బుల్లియ్య, యలమంద, శివకుమార్, సీఫెన్‌బాబు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న చందు సాంబశివుడు, పార్టీ నాయకులు

మద్యం మత్తులో ఘర్షణ

యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణం సాయి బాబా గుడి పరిసర ప్రాంతం, లంబాడీ పేటలో మద్యం మత్తులో ఇద్దరి యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో నాని అనే యువకుడిని మద్యం బాటిల్ తో పొడిచిన లక్ష్మణ్. తీవ్ర గాయపడిన నాని ని హాస్పిటల్ కు తరలించిన స్థానికులు.

21వ డివిజన్‌లో 'గడపగడపకు'

ప్రజాశ క్తి-గుంటూరు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం సాయంత్రం 21వ డివిజన్ కార్పొరేటర్ కాండ్రుగుంట గురవయ్య ఆధ్వర్యంలో 76 వ సచివాలయంలో రెండో రోజు కష్ణ బాబు కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ హాస్పిటల్ వద్ద నుండి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాశన సభ్యులు మద్ధాళి గిరిధర్ రావు పాల్గొని ఇంటింటికి తిరుగతూ ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని సదరు అధికారుల ద్వారా అక్కడిక్కడే పరిష్కరించే విధంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 21డివిజన్ ప్రెసిడెంట్ కొండారెడ్డి నాగేశ్వర రెడ్డి, కేతవాట్ రవీంద్ర నాయక్, విజయ్,కాటం పవన్, గాస్ బాబు, బంగారపు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ 25 ఆంధ్రా బెటాలియన్ NCC A సర్టిఫికేట్ పోయినది.

నవులూరు గ్రామం, మంగళగిరి మండలం, డోరు నెంబరు: 3-428/1 వాస్తవ్యురాలు భూతపాటి నిహారిక D/o రూబెన్ కుమార్ యొక్క 25 ఆంధ్రా బెటాలియన్ NCC A సర్టిఫికేటు మా ఇంటి నుంచి నవులూరు సెంటర్‌కి జిరాక్స్ కోసం వెళ్తుండగా పోయినది. పైన తెలిపిన A సర్టిఫికేట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించగలరు.

సెల్ నెంబర్: 9182703571

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఏపిఎస్ఆర్‌టిసి గుంటూరు -2 డిపోలో ప్రభుత్వ ఆదేశాల మేరకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంబించినట్లు ప్రిన్సిపల్, డిపోమేనేజర్ ఎస్‌కె. అబ్దుల్ సలామ్ ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటివరకు 9 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నాయని, 10వ బ్యాచ్ అతి త్వరలో ప్రారంభించబడుతుందన్నారు. 10వ బ్యాచ్ కొరకు అడ్మిషన్స్ ప్రారంభిస్తున్నామని, శిక్షణ పొందుట కొరకు పేర్లు నమోదు చేయించు కోవాలని కోరారు. సీట్లు పరిమితంగా ఉంటాయని, ఒక్కొక్క బ్యాచ్‌కి 16 మంది మాత్రమే ఉంటారన్నారు.

ప్రతిరోజు ఒక గంట వాహనం యొక్క వివిధ భాగాల గురించి వాటి పనితీరు గురించి వివిధ రకాల రోడ్ల గురించి రోడ్ల పైన ఉండే పెయింటింగ్ మార్కుల గురించి రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డులను గురించి రోడ్ల ప్రక్కన ఉండే సిగ్నల్ బోర్డుల గురించి సవివరంగా చెప్పబడుతుంది. అలాగే ప్రతిరోజు ప్రాక్టికల్ గా ప్రతి ఒక్కరిచేత పదిహేను కిలోమీటర్లు బస్సును నడిపించబడును. మావద్ద వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరు చూయించి వాటి నివారణ కొరకు సవివరంగా చెప్పబడును. అలాగే మా గ్యారేజీ లో సుదీర్ఘ అనుభవం కలిగిన మెకానిక్ లచే వాహనం యొక్క విడిభాగాలు అన్ని చూపిస్తూ వాటి యొక్క పనితీరు గురించి వివరిస్తారు. ఘాట్ రోడ్‌లో ఎటువంటి భయం లేకుండా నడుపుటకు కొండవీడు ఘాట్ రోడ్డు లోనూ ,, కోటప్పకొండ ఘాట్ రోడ్డు లో వారి చేత స్వయంగా వాహనం నడిపిస్తారు. శిక్షణ పూర్తి అయ్యాక ఫామ్ -5, ఫామ్-5ఏ సర్టిఫికెట్స్ జారీ చేస్తామని, తద్వారా అభ్యరి ఆర్‌టిఏ నిర్వహించే టెస్ట్‌లో పాల్గొని లైసెన్స్ పొందవచ్చు. వివరాలకు 8897371003, 7382894585 నెంబర్లకు సంప్రదించవచ్చని డిపో మేనేజర్ అబ్దుల్ సలామ్ తెలిపారు.

'చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకే..'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేస్తోంది చంద్రబాబు నాయుడుని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకేనని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి ప్రత్తి పాటి పుల్లారావు అన్నారు. స్థానిక పండరీపురంలోని తన నివాసంలో ఆదివారం జరిగిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సి ఓటరు', 'ఇండియా టుడే' సర్వేలో ముఖ్యమంత్రి జగన్ గ్రాఫ్ 56 నుంచి 39 శాతానికి పడిపోయిందని అన్నారు. లోకేష్ పాదయాత్ర ప్రభావంతో 175 నియోజకవర్గాల్లో వైసిపి గెలవదని, డిపాజిట్లు కూడా దక్కవని, జిల్లాకు చెందిన మంత్రి, జగన్ కూడా ఇంటికి పోక తప్పదని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాల కంటే రెట్టింపు పథకాలు అమలు చేస్తామని, జగన్ ప్రభుత్వంలో 'రైతుబంధు','ఆసరా', 'చేయూత' పథ కాలను ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి.నెం. 27/2022

బైరెడ్డి సైదారామిరెడ్డి **-పిటిషనర్**
వర్సెస్

1. రెక్కల రామిరెడ్డి S/o కొండారెడ్డి, నియర్ పంచాయితి ఆఫీసు, నకరికల్లు - పోస్టు మండలం, పల్నాడు జిల్లా, **2.** రెక్కల వెంకటేశ్వరరెడ్డి S/o రామిరెడ్డి, నియర్ పంచాయితి ఆఫీసు, నకరికల్లు - పోస్టు మండలం, పల్నాడు జిల్లా, **3.** ఆవుల సుబ్బమ్మ W/o రామిరెడ్డి, నియర్ పంచాయితి ఆఫీసు, నకరికల్లు - పోస్టు మండలం, పల్నాడు జిల్లా, **4.** కాణతం రామిరెడ్డి, S/o నాగిరెడ్డి, నియర్ పంచాయితి ఆఫీసు, నకరికల్లు - పోస్టు మండలం, పల్నాడు జిల్లా, **5.** షేక్ బుజ్జి S/o గిడ్డ సైదా, మెయిన్‌రోడ్, నకరికల్లు పోస్టు మండలం, పల్నాడు జిల్లా **- రెస్పాడింట్స్**

నోటీసు

పై నెంబరు ఐ.పి.27/2022 అనగా దివాలా పిటీషన్, నరసరావుపేట అడిషనల్ సినీయర్ సివిల్ జడ్జి శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీకై ఉత్తర్వులు ఇచ్చినందున మీరు పైకోర్టు వారి యెదుట ది.03-02-2023న స్వయంగా గానీ, అడ్వకేటు గారి ద్వారా కాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనని యెడల మీ పరోక్షమందు పై వాజ్యము చట్ట ప్రకారము తీర్మానము చేయబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేది: 03-02-2023

ఇట్లు
షేక్ అలీబాష
పిటీషనర్ తరపు అడ్వకేటు
నకరికల్లు పోస్టు మండలము,
నరసరావుపేట, పల్నాడు జిల్లా
సెల్: 9985756998

(శ్రీకోర్టు వారి ఉతర్వుల ప్రకారము)

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE::GUNTUR
I.A.No:684/2019 AND I.A.No:685/2019 in O.S.No:380/2014

Between:
Vale Govardhana Kumari ...**Petitioner/Plaintiff**
And
1)Pulakanam Lakshmi Vara Prasada Rao (Died),2) Pulakanam Vara Lakshmi and Others ....**Respondents**
To,
R-2:Pulakanam Vara Lakshmi,W/o.Late Lakshmi Vara Prasada Rao,
R-3:Pulakanam Eswar,S/o.Late Lakshmi Vara Prasada Rao,
R-4:Pulakanam Venkata Krishna Chaitanya,S/o.Late Lakshmi Vara Prasada Rao,All are R/o.Door No:9-8-329,6th lane, Syamala Nagar, Guntur.

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం :684/2019 & 685/2019 లను 1వ ప్రతివాది యొక్క LR'S గా చేర్చుమని & to Set aside the abatement order కొరకు దాఖలు చేసిన పిటీషనులలో రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా,సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 07-02-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపరచటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:07-02-2023

"మన్నవ శ్రావణ్ కుమార్ "
పిటీషనరు/వాది తరపు న్యాయవాది,"
"అపరాజిత"4/19 బ్రాడీపేట,
గుంటూరు,సెల్: 94402 60814

హమాలి, ముఠా కార్మికుల సంక్షేమం పట్టదా?

- కూలి పెద్దగా పెరగట్లేదు ● సంక్షేమ పథకాలు అందట్లేదు
- అనారోగ్యంపాలైతే వైద్యం చేయించుకోలేకపోతున్నాం
- సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వానికి కార్మికుల వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

హమాలి, ముఠా కార్మికుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని పట్టణ హమాలి ముఠా కార్మికులు కోరుతున్నారు. సివిల్ సప్లై, నిత్యావసర, ట్రాన్స్‌పోర్టుతో పాటు వివిధ రంగాల్లో, వివిధ ప్రాంతాల్లో పని చేసే కూలీలే కాకుండా పట్టణంలో సుమారు 20 వేల మంది వరకు కార్మికులు వున్నారు. మోటారు ఫీల్డ్‌కు సంబంధించిన వారు పది వేల మంది వరకు, ఇతర కూలి పను లు చేసే వారు ఐదు వేల మంది వరకు ఉంటారు. వీరిలో భవన నిర్మాణ కార్మికులు గాని, సీజనల్ గా రకరకాల పనులు చేసుకునే కార్మికులు గాని సుమారు పది నుంచి పద మూడు వేల మంది వరకు వున్నారు. కూలి పెద్దగా పెరగడం లేదని వారు వాపోతు న్నారు. తమకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదని, కూలి రేట్లు పెరగాలంటే యజమానులను బతి మాలు కోవాల్సిన పరిస్థితి నెల కొందని చెబుతున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్,ఇతర పనులు చేసి అనా రోగ్యాలకు గురవుతున్నా మని, సరైన వైద్యం చేయించుకో లేకపోతున్నామి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిభద్రత, వయసు మళ్ళిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించకపోవడం దురదృష్టకరమని అన్నారు.

ఇంజన్‌తో ఉండే తోపుడు బండ్లు ఇప్పించాలి

ముఠా కార్మికుడు బానావత్ తులసి నాయక్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ముఠా కార్మికుడిగా పని చేస్తు న్నానని, పురుగుమందులు, ఎరువుల దుకాణాల వద్ద పనులు చేస్తున్నట్లు చెప్పాడు. పురుగుమందుల 10 లీటర్ల కేసును ఎత్తినా, దించినా ప్రస్తుతం 8 రూ. ఇస్తున్నారని, 50 కిలోల ఎరువుల బస్తాకు కూడా రూ.8 రూ. ఇస్తు న్నారన్నారు. ఇంజన్‌తో ఉండే తోపుడు బండ్లు ఇస్తే కనక తమ బతుకుదెరువు మరి కొంతకాలం జరుగుతుందన్నారు.

పెరిగిన ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెరగాలి

కార్మిక చట్టాలను అమలు చేయక పోగా నాలుగు లేబర్ కోడ్‌లగా మార్చా రని సిఐటియు పల్నాడు జిల్లా ఉపా ధ్యక్షులు పేరుబోయిన వెంకటేశ్వర్లు విమ ర్శించారు. కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుకూలం గా కూలి రేట్లు పెరిగేలా ఒక చట్టాన్ని రూపొందించా లని అన్నారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, యాభై సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ రూ.5 వేలు పింఛన్‌గా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అటవీ హక్కు పాసుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-అచ్చంపేట

మండలంలోని కొండూరు సచివాలయ పరిధిలోని శ్రీనివాస తండా, సట్టుబడి తండాలకు చెందిన గిరిజనులకు అటవీ హక్కు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే నంబూరు శంకర రావు అందజేశారు. ఆదివారం కొండూరులో గడపగడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు అనంతరం లబ్ధిదారులకు అటవీహక్కు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు తండాలకు చెందిన 14 మందికి ఈ పాస్ పుస్తకాలు అందజేసినట్లు చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఈ హక్కులు అందినట్లు చెప్పారు. అటవీ హక్కు పత్రాల ద్వారా కొండపోడు భూములపై వారికి హక్కు వస్తుందని, ఎన్నో ఏళ్లుగా అటవీ ప్రాంతంలోనే జీవనం సాగిస్తున్న వారికి దీని ద్వారా ఎంతో లాభం చేకూరుతుంద న్నారు. వీటి ద్వారా చిన్న తరహా అటవీ ఉత్పత్తులు, అడవిలో ఉండే నీటివనరులు, అడవిలో పశువులను మేపుకునే హక్కు, ఆవాసపు, నివాసపు హక్కులతో పాటు అడవిలో దారులపై శాశ్వత అనుభవ హక్కు లభిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అటవీ హక్కు పాసుపుస్తకాలు అందజేయ డంపై గిరిజనులు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి టి.విజయప్రతాపరెడ్డి, సర్పంచ్ కె.శ్రీదేవి బుక్య, రజనీబాయ్, కృష్ణనాయక్, ఎన్.చంద్రబాబు, సిహెచ్ చంద్రయ్య తది తరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని సీఎం వినుకొండకు ఎందుకు? : జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-నరసరావుపేట

నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్ష నేత హోదాలో వినుకొండకు వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌కు నాలుగేళ్ల తర్వాత ఈ ఊరు గుర్తుకు వచ్చిందా అంటూ టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజ నేయులు విమర్శించారు. ఈ నెల 30న జగన్ వినుకొండకు రానున్న నేపథ్యంలో ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ అభివృద్ధి కోసం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేని సీఎం ఏమి సాధించారని వినుకొండ పర్యటనకు వస్తున్నారని ప్రశ్నించారు. చేదోడు పథకం నగదు బటన్ నొక్కడం కోసం ఇక్కడికి రావడం ఎందుకు? తాడేపల్లి ప్యాలస్ నుంచే ఈ పని చేయొచ్చని అన్నారు. ఇప్పటికైనా వెనుకబడ్డ వినుకొండ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, వరికపూడిసెల ప్రాజెక్టు, గుండ్లకమ్మ నదిపై తంగిరాల డ్యాం, వినుకొండకు వ్యవసాయ కళాశాల, గిరిజన యూనివర్సిటీ తదితర అంశాలపై స్పష్టమైన హామీని ముఖ్యమంత్రి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అవినీతిపై విచారణ జరిపించాలని అన్నారు. పల్నాడు జిల్లాలో 15 వేలకు పైగా బెల్ట్ షాపులలో తెలంగాణ మద్యంను వైసిపి ఎమ్మెల్యేలు కనుసన్నల్లో విక్ర యిస్తున్నారని ఆరోపించారు. వినుకొండ నియోజకవర్గంలో రెండువేల బెల్ట్ షాపులు ఉన్నాయని, ఎమ్మె ల్యేలకు ముఖ్య మంత్రి ఏమైనా లైసెన్స్ ఇచ్చారా అని ప్రశ్నించారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్రత పేరుతో పచ్చని చెట్లు నరకడం దుర్మార్గమన్నారు. చెట్లను తొలగించిన ప్రాంతంలో పార్టీ జెం డాలు కట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరు ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న తారకరత్న ఆరోగ్యం మెరుగు పడాలని ఆకాంక్షించారు. సమా వేశంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి జి.జనార్ధన్ బాబు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పి.రామిరెడ్డి, కడియం కోటి సుబ్బారావు పాల్గొన్నారు.

నాసరయ్య, పున్నారావుకు సిఐటియు నివాళి

మున్సిపల్ విభాగంలో మృతుల కుటుంబాలను ఆదుకోవాలని నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-నరసరావుపేట

అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, కుటుం బంలో ఒకరికి ఉద్యోగం, పిఎఫ్, ఇతర బెని ఫిట్స్, మట్టి ఖర్చులు నగదు సకాలంలో అంద జేయాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కోశాధికారి డి.శివకుమారి, సిఐటియు పట్టణ కార్యదర్శి ఈవూరి మస్తాన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనా రోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందిన స్థానిక 4వ డివిజన్ శానిటేషన్ కార్మికుడు నంబూరి నాసరయ్య (45) మృత దేహా న్ని ఆదివారం వారు సందర్శించి నివాళులర్పిం చారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. నాసరయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శివ కుమారి మాట్లాడుతూ ఉద్యమాలలో నాసరయ్య చురుగ్గా ఉండేవారని, కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యూనియన్ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేసే వారని అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయ కులు మాట్లాడుతూ నాసరయ్య మృతి యూని యన్‌కు తీరనిలోటని అన్నారు. నరసరావుపేట మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ట్యాంక్ ఆపరేటర్‌గా పని చేస్తున్న కుంచాల పున్నారావు అనా రోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పున్నారావు మృతదేహానికి సిఐటియు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మృతులకు యూనియన్ నాయకులు శేషయ్య, భూషణం, రమేష్, మల్లయ్య, పి. ఏసు, యోహా న్, సాల్మన్, వీరకుమార్ నివాళులర్పించారు.

నంబూరి నాసరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

కుంచాల పున్నారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

జిఒ 1తో నష్టపోయేది సామాన్యులే

నిరసన హక్కును కాలరాసే జిఒ రద్దుకు ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-క్రోసూరు

జిఒ నంబర్ 1ను రద్దు చేయాలని వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో కేంద్రం కన్వీనర్ టి.హనుమంతరావు అధ్యక్షతన బహిరంగ అధ్యయన వేదిక సమావేశం ఆదివారం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ 1856లో సిపాయిల తిరుగుబాటు అనంతరం ఈ తరహా చట్టాన్ని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం తెచ్చిందని, ప్రజాస్వామిక, ప్రాథమిక హక్కులకు ఈ జిఒ విఘాతమని చెప్పారు. సిపిఐ మండల కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం జిఒ 30ను ఈ తరహాలోనే తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ చర్యల వల్ల ప్రజల ఆలోచనలు, అభిప్రాయాల వ్యక్తీక రణకు అవకాశం ఉండదని చెప్పారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ బోర్డుకు చెందిన రూ.600 కోట్లను గత ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిందని, కార్మిక పోరాటంతో తిరిగి రూ.400 కోట్లు ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం రూ.900 కోట్లను మళ్లించి బోర్డునే ప్రమాదంలో పడేసిందని విమ ర్శించారు. దీనిపై పోరాడేందుకు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడుదూ రైతులకు నష్టం కలిగించే ఈ చర్యలను తిప్పికొట్టాలంటే పోరాడాలని, అందుకు జిఒ1 అనుమతిస్తుందా? అని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని కార్మికులు, వివిధ రంగాల ఉద్యోగులు కోరుతున్నారని, మరోవైపు కార్మికుల హక్కులను ప్రభుత్వాలే కాలరాస్తున్నాయని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారికి పోలీసులు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, జిఒ 1 వల్ల నిరసన హక్కునే కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జిఒ వల్ల నష్టపోయేది కార్మికులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలేనని, ఈ అంశాలన్నింటిపైనా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అసరం ఉందని అన్నారు.

ఆమంచి విజ్ఞాన కేంద్రంలో బహిరంగ అధ్యయన వేదిక సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సీటు బెల్టు తప్పనిసరి

ప్రజాశక్తి-కారెంపూడి

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు తప్పని సరిగా ధరిస్తే ప్రమాదాలు నివా రించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.శేషారెడ్డి అన్నారు. ఆదివారం. కారంపూడిలో వాహనాలు తనిఖీ చేశారు. సీటు బెల్టు ధరించకపోవడం వలన ఎయిర్ బ్యాగులు ఓపెన్ కాక ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకపోతే కేసులు నమోదు చేస్తామని,గూడ్స్ వాహనాలలో ప్రజలు ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించారు.

విద్వేషాలను రెచ్చగొట్టే సాహిత్యం పట్ల అప్రమత్తం

- కాలమాన పరిస్థితులకు అద్దం పట్టేలా రచనలు రావాలి

మాట్లాడుతున్న అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - గుంటూరు

సమాజ సంక్లిష్ట పరిస్థితులను గమనించాల్సిన బాధ్యత సాహిత్య సంఘాలపై ఉందని,నేటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టే కవిత్వం, కథా సాహిత్యం వస్తుందా? లేదా? అని పరిశీలించుకోవాలని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ, కవి సమ్మేళనాన్ని బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మత విద్వేషాలను రెచ్చగొట్టే సాహిత్యమూ వస్తోందని, ఆ విషయంలో సాహితీవేత్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాహిత్య సంఘాలమధ్య సమన్వయం కోరుకోవడమే సాహితీవేత్తల మొదటి కర్తవ్యమన్నారు. నటులు, రచయిత విడదల సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం, రాజకీయ పార్టీలు తప్పు చేస్తే ప్రశ్నించే హక్కు రచయితలకు ఉందన్నారు. పోటీల కోసం రచనలు చేస్తే ప్రతిభ మరింత పెరుగుతుందని, అయితే బహుమతుల కోసమో, ప్రభుత్వ పురస్కారాల కోసమో రచనలు చేయకూడదని అన్నారు. అనంతరం డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, డాక్టర్ రమణ యశస్వి మాట్లాడారు. జిల్లా నూతన కమిటీకి రూ.5,116 విరాళాన్ని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి యేమినేని వెంకటరమణ అందించారు. రచయిత్రులు పి.విజయశ్రీ, సిహెచ్ సుశీలమ్మ, విజయ, ఎం.వెంకట గురువు, బి.భానోజీబాబు, పి.శివశంకరరావు, పి.భాగ్యలక్ష్మి, పి.వి. రమణకుమార్, రాజ్‌కృష్ణ, ఎం.వెంకట రఘునాథరావు, బాపయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ గేయ రచయిత వేటూరి జయంతి-గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించారు.

నూతన కమిటీ

గుంటూరుజిల్లా శాఖ అధ్యక్షులుగా డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా సయ్యద్ జానీ బాష, ఉపాధ్యక్షులుగా కాకరపర్తి సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులుగా శ్రీమతి విజయ గోలి, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, ఆళ్ళ నాగేశ్వరరావు, కారంచేటి విజయకుమార్, కోట లీలాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధిగా బండికల్లు జమదగ్ని బాధ్యతల్ని స్వీకరించారు.

నేటి నుండి కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి13వ తేదీ వరకూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. కుష్టు పట్ల అవగాహన, ముఖ్యంగా వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా ఉండటానికి తీసుకోవాల్సిన చర్యల గురించి 15 రోజులపాటు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నేడు జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమం గురించి అధికారికంగా సందేశం ఇస్తారన్నారు. కావున ప్రజలంతా లెప్రసీ అవగాహన కార్యక్రమంలో పాల్గొని కుష్టు రహిత సమాజం కోసం కలిసి రావాలని కోరారు.

గర్భిణులు షుగర్ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు బూసిరెడ్డి దీప్తిరెడ్డి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గర్భం దాల్చిన తర్వాత కొంతమందికి షుగర్ సంక్రమించే అవకాశం ఉంటుందని, దీని నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రసూతి, గర్భ కోశ వ్యాధుల నిపుణులు బూసిరెడ్డి దీప్తిరెడ్డి సూచించారు. మండలంలోని పాతమల్లాయపాలెంలో ఉన్నతి ఫౌండేషన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తిరెడ్డి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత షుగర్ పోతుంది కదా అని గర్భ సమయంలో నిర్లక్ష్యం చేయకూడదని, దీనివల్ల తల్లీబిడ్డలకు దుష్పరిణామాలు ఉంటాయని అన్నారు. గర్భిణులు 13 వారాల్లోపు అన్ని రకాలైన వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రధానంగా న్యూకల్ ట్రాన్స్ లూసెన్సి (ఎన్‌టి) స్కాన్ చేయించుకోవాలని, డబుల్ మార్కర్ టెస్ట్, క్రోమోజోన్ ఎనాలసిస్ టెస్ట్, రక్తహీనత, షుగర్ టెస్ట్‌లు చేయించుకోవాలని చెప్పారు. 18 వారాల నుంచి ఐరన్, ఫోలిక్ యాసిడ్ తీసుకోవాలన్నారు. 3, 5 నెలల్లో టీటీ ఇంజెక్షన్లు చేయించాలని, 20 నుంచి 22 వారాల్లోగా టిఫా స్కాన్ పరీక్ష చేయించుకుంటే గర్భంలో ఉండే బిడ్డకు సంబంధించి గుండె, తల, శరీరం ఎముకల్లో ఎదుగుదల లోపాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. లోపాలు గుర్తిస్తే తదనుగుణంగా చర్యలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసు పద్మావతి, కాసు రాజశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి 6నెలలకొకసారి కేన్సర్ పరీక్షలు తప్పనసరి

హ్యాపి హాస్పిటల్స్ సీనియర్ వైద్యులు డాక్టర్ పవని ప్రియాంక

మాట్లాడుతున్న సీనియర్ వైద్యులు డాక్టర్ పవని ప్రియాంక

ప్రజాశక్తి-తెనాలి

మహిళలు అప్రమత్తంగా ఉండి తరచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్‌ను ముందస్తుగానే గుర్తించవచ్చని హ్యాపి హాస్పిటల్స్ సీనియర్ వైద్యులు డాక్టర్ పవని ప్రియాంక అన్నారు. ఆదివారం పట్టణంలోని హ్యాపి హాస్పిటల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా వైద్యశాల్లో మహిళా పోలీసు సిబ్బందికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిషన్ మహిళల్లో వచ్చే క్యాన్సర్, దానికి కారణాలు. ముందు జాగ్రత్త చర్యలపై వివరించారు. డాక్టర్ పవని ప్రియాంక మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకు ఓసారి మహిళలు క్యాన్సర్‌పరీక్షలు చేయించు కోవాలన్నారు. గర్భాశయ ముఖద్వారా కాన్సర్‌ను గుర్తించే విదానాలను వివరించారు. డాక్టర్ డివికె హరిణి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం వైద్యశాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంటాయని, దానిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టి వైద్యులు అరుణ్‌తేజ, రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.భానుమతి, మనోరంజని, హెచ్‌ఆర్ ఉదయ, పిఆర్వో సురేంద్ర, కె.లీలా కుమార్, ఎం.శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిభిరం

హ్యాపి హాస్పటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు ఉచిత వైద్యశిభిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల అధినేత డాక్టర్ పవని ప్రియాంక తెలిపారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. రెడ్‌క్రాస్‌తో కలిసి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వర్క్‌షాపులో పాల్గొన్న డాక్టర్లు , విద్యార్థులు

ఎన్‌ఆర్‌ఐలో వివిథ-ల్యాప్ వింగ్ వర్క్ షాప్

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

స్థానిక మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మినీ ఆడిటోరియంలో ప్రసూతి, గైనకాలజీ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి డాక్టర్ ప్రభాదేవి, డాక్టర్ గంగాధరరావు ఆధ్వర్యంలో వివిథ-ల్యాప్ వింగ్ వర్క్ షాప్ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ అనగాని డాక్టర్ మంజుల హాజరైయ్యారు.గైనకాలజీ విభాగానికి సంబంధించిన లైవ్ లాప్రోస్కోపీ పాల్గొన్న వైద్యులును ఆకట్టుకుంది. డాక్టర్ మంజుల మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వైద్యరంగంలో అనేక మార్పులు వచ్చాయని, వాటిని అందిపుచ్చుకొనే బాధ్యత వైద్యులపై ఉందని గుర్తు చేశారు. సీనియర్ వైద్యులు పర్యవేక్షణలో లైవ్ లో లాప్రోస్కోపీ ప్రాముఖ్యతను ప్రదర్శించారు.కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుండి డాక్టర్లు, వైద్య విద్యార్థులు వచ్చారు. ఈ కార్యక్రమానికి వాగ్స్ ఆర్గనైజేషన్ వారు సహకారం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, డాక్టర్ రామలింగం, డాక్టర్ ఉమా, డాక్టర్ సునీత, డాక్టర్ మౌనిక, డాక్టర్ బహదూర్మరియు వోగ్స్ ప్రతినిధులు, వైద్యుల,విద్యార్థులు పాల్గొన్నారు.

బుర్రకథ బృందాన్నిసత్కరిస్తున్న శ్రీ కళారంజని బృందం

ప్రజల హృదయాలకు చేరువుగా బుర్రకథ

ప్రజాశక్తి-తెనాలి

అత్యంత ప్రాచీనమైన జానపద కళారూపాల్లో ఒకటైన బుర్రకథ ప్రజల హృదయాలను హత్తుకుందని శ్రీ కళారంజని అధ్యక్షురాలు డాక్టర్ కెఎస్‌ఎల్ పద్మావతి అన్నారు. పట్టణానికి చెందిన శ్రీ కళారంజని సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నందులపేట కవిరాజాపార్కులోని విజెకే భవన్‌లో శ్రీనివాస కల్యాణం బుర్రకథ ప్రధర్శన జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కథ చెప్పటానికి వివిద జానపథ కళారూపాలున్నాయన్నారు. వాటిలో ఇప్పటికీ ప్రజలకు హత్తుకుపోయే కళారూపం బుర్రకథ అని కొనియాడారు. సంస్థ గౌరవాధ్యక్షులు ఆచార్య మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ బుర్రకథ సామాజిక చైతన్యానికి నాంది పలికిందన్నారు. శ్రీ కళారంజని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో బుర్రకథ, గతంలో ప్రదర్శించిన హరికథకు చోటు దక్కటం కళాకారుల ప్రోత్సాహానికి నిదర్శనమని వాకా పేరిరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా బుర్రకథ కళా బృందం సభ్యులను భాగవతారిణి వి.భానుమతి, అమృతవల్లి, ఎం.లక్ష్మీజ్యోతి లను సంస్థ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిఎన్ సందీప్‌కుమార్, హనుమారెడ్డి, వి.కరుణ, కళాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి పశువులు గర్వకారణం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి
- కోలాహలంగా ముగిసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు
- కృష్ణా జిల్లా భక్తుని సుబ్బారావు ఎడ్ల జతకు ప్రథమ స్థానం
- మాజీ మంత్రి ఆనందబాబు ఎడ్ల జతకు ద్వితీయ స్థానం
- కుంచనపల్లికి చెందిన జశ్వితరెడ్డికి ఎడ్ల జతకు తృతీయస్థానం

ప్రజాశక్తి-నరసరావుపేట

ఒంగోలు జాతి పశువులు తెలుగు జాతికి గర్వ కారణమని, వీటిని ఆదాయం కోసం కాకుండా పేరు ప్రతిష్టల కోసం ఆర్థిక వెసులుబాటు ఉన్న రైతులు మాత్రమే పోషిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతు సంబరాలలో భాగంగా స్థానిక జిల్లా క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శన పోటీలు ఆదివారం కోలాహలంగా ముగిశాయి.

ఆదివారం సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీలను ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మంత్రి కాకానిని, ఎమ్మెల్యే శ్రీదేవిని ఘనంగా సన్మానించారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల కోసం ప్రత్యేకంగా ఎద్దులను పెంచే సంస్కృతి పూర్వకాలం నుంచి ఉందని, వీటి పోషణకు ప్రత్యేక ఆహారంతో పాటు శిక్షణ కూడా ఇస్తారన్నారు. వ్యవసాయ రంగంలో పెరిగిన యాంత్రీకరణతో ఒంగోలు జాతి పశువులతో పాటు వ్యవసాయంలో వినియోగించే ఇతర పశువుల పోషణ కూడా తగ్గిపోయిందన్నారు. కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువులకు పుట్టినిల్లు అయిన ఆంధ్ర రాష్ట్రంలో వాటి పెంపకం తగ్గిపోయిందని, ఈ జాతి పశువుల పోషణకు రైతులు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. పోటీలను చూసేందుకు అధిక సంఖ్యలో వచ్చిన రైతులకు ప్రజలకు మంత్రి అభివాదం చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాతీయస్థాయిలో జరిగిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన నిర్వహణ కమిటీ సభ్యులకు, రైతులకు, ప్రజలకు ఎమ్మెల్యే గోపిరెడ్డి అభినందనలు తెలిపారు. సీనియర్స్ విభాగంలో 9 జతలు పోటీపడ్డాయి.

నిర్ణీత సమయంలో 3757 అడుగులు మేర బండ లాగి కృష్ణాజిల్లా కానూరు పెనమలూరుకు చెందిన భక్తుని సుబ్బారావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు చెందిన ఎడ్ల జత 3600 అడుగులు మేర లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి కుంచనపల్లికి చెందిన పులగం జశ్వితరెడ్డికి చెందిన ఎడ్ల జత 3532 అడుగులు లాగి తృతీయ స్థానం సాధించాయి.

పోటీలో తలపడ్డ అన్ని ఎడ్ల జతల యజమానులకు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. వచ్చే ఏడాది కూడా ఈ పోటీలు ఘనంగా నిర్వహిస్తామని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి : ఎమ్మెల్యే పిన్నెల్లి



ప్రజాశక్తి-కారెంపూడి

వైసిపి పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతు న్నాయని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని చింతపల్లిలో ఆదివారం గడపగడ పకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివరించారు. రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలు అందిస్తున్నామని అన్నారు. రైతులకు 'రైతు భరోసా', మహిళలకు 'చేయూత', విద్యార్థులకు 'అమ్మ ఒడి','విద్యా దీవెన' వంటి పథకాలను వర్తింపజేస్తున్నామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తు న్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం. శారద శ్రీనివాసరెడ్డి, జెడ్పిటిసి షేక్ షఫీ,ఎంపిటిసి టి.నిర్మల అచ్యుతరావు, కె.సుబ్రహ్మణ్యం, సిహెచ్.చంద్రశేఖర్ రెడ్డి, బి.అల్లయ్య, కె.చంద్రశేఖర్, సర్పంచ్ యు. రామాంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో కొరవడిన నాణ్యత ప్రమాణాలు

- పాతగన్లనే ఉపయోగిస్తున్న వైనం
- నిబంధనలకు తిలోదకాలు
- నిద్రావస్థలో అధికారులు
- చిలకలూరిపేటలో పరిస్థితి ఇది..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పెట్రోల్ బంకులపై కంపెనీల అజమాయిషీ గాని, అధికారుల తనిఖీలు గాని లేకపోవడంతో యజమానుల ఇష్టారాజ్యంగా తయారైందని లారీ యజమానులు, పెట్రోల్ వినియోగదారులు, వాహన యజమానులు, రైతులు ఆరో పిస్తున్నారు. బంకుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేశారంటున్నారు. పట్టణ పరిధిలో హెచ్‌పి, భారత్, ఇండియన్, నయర, రిలయన్స్ కంపెనీలకు చెందిన పెట్రోల్,డీజిల్ విక్రయించే బంకులు సుమారు 14 ఉన్నాయి. కొన్ని బంకుల్లో మెంతల్ (చెరకు పిప్పి నుంచి ఒక రకమైన కెమికల్), బయో డీజిల్‌ను కల్తీగా కలిపి విక్రయాలు జరుపుతున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని బంకుల్లో అయితే లీటర్ పెట్రోల్ కొట్టిస్తే సుమారు 75 నుంచి 100 ఎంఎల్ వరకు తగ్గుతోందని చెబుతున్నారు. ఈ విషయమై అధికారులకు చెలనం లేకుండా పోతుందని, కనీసం గతంలో ఆయా కంపెనీ అధికారులు వెంటనే స్పందించే వారని ఇప్పుడు అయిల్ అమ్మిడైతే చాలను కుంటున్నారను కుంటున్నారని కుంటున్నారు. డబ్బు లు లేక అప్పు తెచ్చు కోవటం వల్ల లీ టర్ కు షుమారుగా వంద ఎంఎల్ దాకా నష్టపోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. బంక్ ల్లో కనీసం వినియోగదారుల కోసం ఉండ వల సిన మౌలిక వసతులు కూడా అర కొ రగా ఉన్నా యంటున్నారు. ఏ బంక్ లలో చూసిన ప్రధానంగా గాలి మిషన్లు పని చెయ్యవు, మూత్ర శాలలుకు, విశ్రాంతి గదులకు తాళాలు వేసి ఉంటా యి. ఇప్పటి కైనా బంకులలో పెట్రోల్, డీజిల్ గన్‌లను సర్వీసింగ్ చేయాలని, గాలి పంపు మిషన్లు సక్రమంగా ఉంచాలని, టాయిలెట్లు,రెస్టు రూములను శుభ్రంగా ఉండేటట్లు చూడాలని వాహన యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థుల సమస్యలపై సీఎంను కలిసేందుకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - వినుకొండ

భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సరస్వతి నిలయం భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సంబంధిత అధికారులకు విద్యార్థి సంఘాల నాయకులు, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. డిగ్రీ కళాశాల భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యలపై సిఎం జగన్‌కు వినతిపత్రం సమర్పించేందుకు అవకాశం కల్పించాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఎం.సుబ్బారావు, రవీంద్ర, కె.వెంకటేశ్వర్లు నాయక్, కృష్ణ కోరారు.

టిడిపి నివాళి

ప్రజాశక్తి-కారెంపూడి

తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి పెన్నుబోయిన వెంకటేశ్వర్లు అని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చిరుమామిళ్ల మధుబాబు అన్నారు. మండలంలోని ఇనపరాజుపల్లిలో వెంకటేశ్వర్లు సంతాపసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు మధుబాబు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి వెంకటేశ్వర్లు క్రియాశీలక పాత్ర పోషించారని, ఆయన మృతి బాధాకరమని అన్నారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.శివారెడ్డి,జిల్లా తెలుగు యు వత అధికార ప్రతినిధి జి.సురేష్ యాదవ్, సిహెచ్ రాము, జి.నాగేశ్వరరావు, బి.హరి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

దస్తగిరి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వినుకొండ

కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గం చినరాజు పాలెంకు చెందిన కుమ్మరి దస్తగిరి పోలీసుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆంధ్ర ప్రదేశ్ కుమ్మరి శాలివాహన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పారెళ్ళ మల్లికార్జునరావు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల వ్యవహరిం చిన తీరుపై మనస్తాపం చెందిన దస్తగిరి, తల్లి పురుగుమందు తాగారని, ఇందులో దస్తగిరి మరణించగా ఆమె హాస్పటల్‌లో కొన ఊపిరితో ఉందన్నారు. ఎస్పై ను, అతనికి సహకరించిన ఎఎస్‌ఐను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి, రాష్ట్ర వ్యాప్త గా నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు.

15న సంత్ సేవాలాల్ జయంతి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ఎర్రకొండ పక్కన ఎస్టి (సుగాలి) కాలనీలో ఉన్న మేరమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణం పక్కన ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వ ర్యంలో ఆదివారం సంత్ సేవాలాల్ 284వ జయంతి కార్య క్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎపి గిరిజన సం ఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి కార్యక్రమం ఫిబ్రవరి 15వ బోయపాలెంలోని ఎస్టీ కాలనీలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇప్పటంలో వైయస్సార్ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటి ఎంసీ పరిధిలోని ఇప్పటంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కమ్యూనిటీ హాల్‌ను శనివారం రాత్రి గ్రామంలో ప్రారంభమైంది. రూ. 1.10 కోట్లతో నిర్మించిన ఈ కమ్యూనిటీ హాల్ భవనాన్ని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కమ్యూనిటీ భవనంలో వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ పేరుతో నిర్మితమైన వంటశాలను ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ తాడేపల్లి మండలంలోని గ్రామీణ ప్రాంత వృత్తిదారులు, పేదలకు బహుళ ప్రయోజనకరంగా నిర్మించారని అన్నారు. ఈ కమ్యూనిటీ హాల్‌లోని భవనాలలో ఆయా తరగతుల వారిచే ప్రారంభించడం శుభ పరిణామం అని ఆయన కొనియాడారు. ఈ కమ్యూనిటీ భవనంలో కళా వేదికకు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరుతోనూ, భోజన నిర్వహణ హాలును సర్దార్ గౌతు లచ్చన్న పేరుతోనూ భవనాలను నిర్మించటం అందరూ హర్షించదగ్గ విషయమని వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి తాడేపల్లి మండల యువజన విభాగం అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి, వైసిపి నాయకులు లచ్చి తులసీదాస్, వెంకటేశ్వరరావు,

ట్రై సైకిళ్ళను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి కొత్తపేటలో ప్రముఖ న్యాయవాది వాకా రామ్ గోపాల్ గౌడ్ కార్యాలయం ఆవరణలో గుంటూరు సుష్మ గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇరువురి వికలాంగులకు రెండు ట్రై సైకిళు ,, వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. న్యాయవాది రాంగోపాల్ గౌడ్ దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, చీరలు పంపిణీ చేసి మాట్లాడుతూ సుష్మ గౌడ్ ఫౌండేషన్ గత 20ఏళ్ల నుంచి సుమారు రూ.1.36 కోట్ల వ్యయంతో జిల్లాలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. గతంలో మంగళగిరిలో పేదలకు కుట్టుమిషన్లు, దుప్పట్లు, ట్రై సైకిల్లు, విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ జల్లడ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ దాసరి వెంకట్రావు, నాయకులు బంటి గౌడ్, కంచర్ల కాశయ్య, వాకా మాధవరావు, మంగారావు, ఏ.నరసింహారావు, తాతా కోటయ్య, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విజయకీలాద్రి క్షేత్రంపై సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరంలోని విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై ఆరవ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు జరిగాయి. శ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో సామూహిక శాంతి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది.

రామనామక్షేత్రం రోడ్డుకు మేయర్ శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యేమద్దాలి, ఎమ్మెల్సీ అపిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రామనామక్షేత్రం నుండి కెవిపి కాలని స్మశాన వాటిక వరకు రూ.80 లక్షల వ్యయంతో సిసి డ్రైన్లు, రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ ఆర్ అగ్రహారం వెంకటేశ్వర స్వామి గుడి నుండి రామనామ క్షేత్రం వరకు మొదటి పేజ్ కింద రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్, బిటి రోడ్డు నిర్మించటం జరిగిందని, 2వ ఫేజ్‌లో రూ.80 లక్షలతో రామనామక్షేత్రం నుండి స్మశాన వాటిక వరకూ డ్రైన్, రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ రోడ్డును అభివృద్ధి చేయడం వలన గుంటూరు నగరంలో 18, 19, 20, 21, 23, 25 డివిజన్లలో ఉన్న ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు కాంద్రుకుంట గురవయ్య, నిమ్మల వెంకటరమణ, జిల్లా గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ బత్తుల దేవానంద్, 20వ డివిజన్ వైసిపి అధ్యక్షులు కంతేటి శ్యాంశేఖర్, ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండలంలోని పేరేచర్ల ఎస్‌జివిఆర్ హై స్కూల్లో 1993-94లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. వారు తమ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. వీరంతా 29 ఏళ్ల అనంతరం ఈ ఆత్మీయత కలయిక సందర్భంగా ఒక చోట చేరి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువులు కొండవీటి రాజేంద్రప్రసాద్, సురేంద్ర, ఖాన్, కోటేశ్వరరావు, అప్పట్లో ప్రవేట్ చెప్పిన శాస్త్రి, గురువులను ఘనంగా పూలమాల, శాలువా, మెమొంటోలను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలియతిరిగి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న 1993-94 పది పూర్వ విద్యార్థులు

చెక్కబల్ల బండిని అందజేస్తున్న నాయకులు

చేనేత కళాకారుడికి చెక్క బల్ల బండి పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని రత్నాలకు చెరువు చెందిన వివివి సత్యనారాయణ, సత్యవతి దంపతులకు ఆదివారం జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు నియోజకవర్గ కార్యాలయంలో చెక్క బండి అందజేశారు. జీవనం సాగించడం కష్టంగా ఉందని తెలపడంతో స్పందించి శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతిరావు, బి.కోమలి, పి.మధు, జేవి.సాంబశివరావు, వాసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ సినీ స్టూడియోస్ చిత్రాలపై సమీక్ష

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఏడాది పాటు పట్టణంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సావాల్లో భాగంగా ఆదివారం రాత్రి కొత్తపేటలోని పెన్షనర్స్ హోమ్‌లో రామకృష్ణ సినీ స్టూడియోస్ చిత్రాల ప్రదర్శనపై సమీక్ష జరిగింది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సంక్రాతి సీజన్‌లో ఎన్టీఆర్ నటించిన రామకృష్ణ సినిస్టూడియోస్ చిత్రాలపై ప్రముఖ విశ్లేషకులు వైద్యవిద్వాన్ డాక్టర్ అగ్నిహోత్రం మురళీకృష్ణ ప్రసంగించారు. ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో చిత్రీకరణ ఉంటుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌ను ఉత్సవ కమిటీ బృందం సత్కరించారు. కార్యక్రమంలో సినీమాటల రచయిత బుర్రా సాయిమాధవ్, డాక్టర్ నారాయణం వేణుగోపాల్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, చెరుకుమల్లి సింగారావు, టి.హరిప్రసాద్, మాదల కోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, డి.భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం.రాఘవరావు పాల్గొన్నారు.

మురళీకృష్ణను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

'అభివృద్ధిని విస్మరించిన చంద్రబాబు, లోకేశ్'

ప్రజాశక్తి -మంగళగిరి

ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని, రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని గుంటూరు, కృష్ణా జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్‌లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్‌లు పేర్కొన్నారు. నగరంలోని తెనాలి రోడ్డు మార్కండేయ పద్మశాలీయ కళ్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గ వైసిపి విస్తృతస్థాయి సమావేశం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. రీజనల్ కో-ఆర్డినేటర్‌లు అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజు నారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్కే నిరంతరం పాటు పడుతున్నారని, ఆయన విజయం కోసం కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో నియోజకవర్గం ప్రజలకు రూ.800 కోట్ల సంక్షేమ పథకాలను అందించామన్నారు. రూ.300 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు నియోజకవర్గ పరిధిలో నివశిస్తున్నా అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. వ్యక్తలకు నాయకులు, కార్యకర్తలు గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

గుంటూరు జిల్లా కలెక్టర్ యం. వేణుగోపాల్ రెడ్డి దంపతులు పొన్నూరు పట్టణంలోని శ్రీ విరాంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించారు. వీరికి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య స్వాగతం పలికారు.కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి పొన్నూరు ఎంఆర్ఓ శ్రీకాంత్ కేదార్నాథ్, ప్రతాప్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-తెనాలి : స్థానిక గాంధీ చౌక్‌లోని సాయి భక్త బృందం 12వ వార్షికోత్సం సందర్భంగా ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. తొలుత నిర్వహించిన పాలాభిషేకం కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగదా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలపై ఆలపాటి మాట్లాడుతూ సాయి భక్త బృందం సేవా భావం గొప్పదన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేశు యుగంధర్, పి.త్రీమూర్తి, మద్దెల చంద్రశేఖర్, చుండూరు రాజ్‌కుమార్, ఆలపాటి శ్రీధర్, ఆర్.శ్రీనివాస్,, టి.హరిప్రసాద్, టి.నాగప్రసాద్, కె. శ్రీను పాల్గొన్నారు.

'చిగురు'కు రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-తాడేపల్లి: అమరావతి కరకట్టపై గల చిగురు ఆశ్రమానికి నాట్కో వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు ఆదివారం రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. రాజధాని ప్రాంతవాసులకు సమీపంలో ఉన్న చిగురు ఆశ్రమంలో శుభకార్యాలు జరుపుకోవడానికి వీలుగా ఆడిటోరియం నిర్మాణం జరుగుతోంది. అందులో ఎయిర్ కండిషన్ ఏర్పాటు చేయడానికి ఈ సాయం అందజేసినట్లు సదాశివరావు తెలిపారు. ఈ ఆడిటోరియం పూర్తయితే దాని ద్వారా వచ్చే ఆదాయం, సంస్థలో ఉన్న అనాథ, పేద విద్యార్థుల చదువులకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా సంస్థతో తనకు అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్, జోసఫ్ తంబి, అంతయ్య, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మస్తాన్ పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ కాంద్రుకు మాతృ వియోగం

ప్రజాశక్తి - మంగళగిరి: మాజీ మున్సిపల్ చైర్మన్ కాంద్రు శ్రీనివాసరావు తల్లి లక్ష్మీ కోటేశ్వరమ్మ (77) శనివారం రాత్రి మృతి చెందారు. లక్ష్మీ కోటేశ్వరమ్మ భౌతికకాయంపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, గోశాల రాఘవ, వాకర్స్ అసోసియేషన్ వీసం వెంకటేశ్వరావు, షేక్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ చిల్లర భవానీదేవి, సోమేపల్లి వెంకటసుబ్బయ్య తదితరులు

రైతు శ్రమను గౌరవిస్తేనే మట్టి బంగారం..

నాగలికి నా నమస్కారం పుస్తకావిష్కరణలో డాక్టర్ చిల్లర భవాని దేవి

ప్రజాశక్తి - గుంటూరు

సగటు రైతు శ్రమను, చెమట చుక్కను గౌరవించిన నాడే మట్టి బంగారం అవుతుందని, అన్నం ముద్ద ఆకలి తీరుస్తుందని తన నానిల కవిత్వం ద్వారా సోమేపల్లి వెంకటసుబ్బయ్య చాటారని ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీదేవి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య రచించిన 'నాగలికి నా నమస్కారం' పుస్తకాన్ని ఆమె భవానీదేవి ఆదివారం ఆవిష్కరించారు. బ్రాడీపేటలోని జాషువా కళా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వ్యవసాయ నేపథ్యమే వెంకటసుబ్బయ్యలోని కవితా తష్ణకు అద్దం పడుతున్నదన్నారు. నానీల కవిత సంపుటిపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధిపతి డాక్టర్ ఎన్‌వి కష్ణారావు, రమ్య భారతి పత్రిక సంపాదకులు చలపాక ప్రకాష్ సమీక్షించారు. కార్యక్రమాన్ని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, ఎన్‌వి సత్యనారాయణ నిర్వహించగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, ఆరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, సాహిత్య వేత్తలు, సాహిత్యాభిమానులు, పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కు చందూస్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి- గుంటూరు : కళాశాల అధ్యాపకుల కోసం జెకెసి కళాశాల, ఆర్‌విఆర్ జెసి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న 26వ చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం మూడో రోజుకు చేరింది. ఉందయం జరిగిన మ్యాచ్‌లో గుడ్లవెల్లూరు ఇంజినీరింగ్ కళాశాల, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలల జట్లు తలపడగా గుడ్ల వెల్లురు ఇంజనీరింగ్ కళాశాల విజయం సాధించింది. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలల మధ్య మ్యాచ్‌లో ఎస్ఆర్‌కేఆర్ కళాశాల టీమ్ తెలుపొందింది. ఆర్‌విఆర్‌జెసి కళాశాల మైదానంలో చేబ్రోలు ఇంజనీరింగ్ కళాశాల, కోనెరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయం జట్ల మధ్య మ్యాచ్‌లో కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయం గెలిచింది. విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం టీమ్‌లు తలపడగా విజ్ఞాన్ విశ్వవిద్యాలయం టీమ్ విజయం సాధించింది. సోమవారం సెమీ ఫైనాల్స్‌లో ఎస్ఆర్‌కే టీమ్, ఆచార్య నాగర్జున విశ్వవిద్యాలయం టీమ్‌లు, కెఎల్‌యు, విజ్ఞాన్ యూనివర్శిటీ జట్లు తలపపడనున్నట్లు నిర్వహణ కార్యదర్శి తుమ్మల శ్రీనివాసరావు తెలిపారు.

సిఎం రాక.. 50 ఏళ్ల చెట్టుకు రంపపు కోత..

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి సిఎం రాక నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా పచ్చని చెట్లనూ అధికారులు తొలగిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద 50 ఏళ్ల నాటి భారీ వృక్షాలను రంపాలతో కోయించి నేలమట్టం చేశారు. డివైడర్లపై పచ్చగా ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్న చెట్లను నరికేయించారు. సిఎం హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసిన జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి వెల్లటూరు రోడ్డులోని సభా స్థళి వరకూ ఉన్న చెట్లను సైతం తొలగించారు. సిఎం రాకపోకలకు అడ్డుగా లేకున్నా భారీ ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేసుకోవడానికి, అవి అందరికీ కనిపించడానికి వీలుగా మరికొన్ని చెట్లను తొలగించారు. దీనిపై స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

చెట్లను కూల్చివేస్తున్న యంత్రాలు

వీరికి వర్తించని ఆదేశాలు

పర్యావరణం పరిరక్షణ పేరుతో ఈనెల 26వ తేదీ నుండి ఫ్లెక్సీ బ్యానర్లపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే అధికార పార్టీకి మాత్రం ఇక్కడ అవేమీ వర్తించలేదు. సిఎంకు స్వాగతం చెబుతూ సిఎం, స్థానిక ఎమ్మెల్యే ఫొటోలతో వైసిపి నాయకులు పలుచోట్ల భారీ ఫ్లెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వినుకొండ పట్టణంలోనూ ఫ్లెక్సీ బ్యానర్లను నిషేధిస్తూ స్థానిక కమిషనర్ బి.శ్రీనివాసులు నోటీసులు సైతం జారీ చేశారు. పలు ఫ్లెక్సీలనూ తొలగింపజేశారు. ఇప్పుడు మాత్రం వైసిపి శ్రేణులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుంటే ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. దీంతో కారంపూడి రోడ్డు, నరసరావుపేట రోడ్డు, వెల్లటూరు రోడ్డు, మార్కాపురం రోడ్డు నుండి అధికార పార్టీ ఫ్లెక్సీలు భారీగా వెలిశాయి.

వైసిపి శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లు

వారి ఫొటోలు లేకుండా స్వాగత ఫ్లెక్సీలు

ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆ పార్టీలోని అంతర్గత విభేదాలను బహిర్గతం చేస్తున్నాయి. స్థానిక శివయ్య స్తూపం వద్ద నుండి కారంపూడి రోడ్డు, వెల్లటూరు రోడ్లలో పెట్టిన ఫ్లెక్సీల్లో అధిక శాతం ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, ఆయన కుమారుడు గిరిబాబు ఫ్లెక్సీలు ఉన్నాయి. వీటితోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు వేసిన అధిక శాతం ఫ్లెక్సీల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఫొటోలు లేకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

200 ఎకరాల్లో మిర్చి యార్డు విస్తరణ

- వచ్చే వారం నుంచి ఉచిత భోజనశాల
- 500 మంది రైతులకు వసతి ఏర్పాటు
- ప్రజాశక్తితో చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం

గుంటూరు మిర్చి యార్డును విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం చెప్పారు. ప్రస్తుతం ఉన్న యార్డు వ్యాపారు లావాదేవీలకు చాలక పోవడం వల్ల 200 ఎకరాల్లో యార్డును విస్తరింప చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

యార్డు విస్తరణకు భూమిని ఎంపిక చేశారా?

భూసేకరణ ఇంకా జరగలేదు. గుంటూరు -చిలకలూరిపేట రోడ్డులో ఎడ్లపాడు మండల పరిధిలో భూముల ఎంపికకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎంత విస్తీర్ణంలో యార్డు నిర్మాణం చేపడుతారు?

200 ఎకరాలు వరకు భూమి అవసరం ఉంది. వంకాయలపాడులోని స్పైసెస్ పార్కు సమీపంలో నూతన యార్డు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న యార్డు పరిధిలో లావాదేవీలకు స్థలం సరిపోవటం లేదు. యార్డు విస్తరణ చేపట్టాలని ఆలోచన ఉన్నా ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు. అయితే విస్తరణకు తమ పాలకమండలి ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది.

రైతులకు ఉచిత భోజన వసతి ఎప్పుడు?

రైతులకు వచ్చే వారంలో ఉచిత భోజనం ఏర్పాటు చేస్తాం. ఇందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. యార్డుకు రోజుకు గత వారం రోజులుగా లక్ష నుంచి లక్షన్నర టిక్కీల మిర్చి వస్తోంది. యార్డులో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే యార్డులో 500 మందికి వసతి సౌకర్యం కల్పించాం.

మిర్చి ఎగుమతులు ఎలా ఉన్నాయి?

గతేడాది గుంటూరు నుంచి వివిధ దేశాలకు, ఇతర రాష్ట్రాలకు మిర్చి ఎగుమతులు భారీగా జరిగాయి. చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, సింగపూర్, శ్రీలంక తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఏడాది ఇంకా ఎగుమతి ఆర్డర్లు ఖరారు కాలేదు. అయినా ఈ ఏడాది ఇప్పటి వరకు సగటు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆహార పద్ధతులతోనే ఆరోగ్యం

గుంటూరు మెడికల్ కాలేజ్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శంకర్

ప్రజాశక్తి-గుంటూరు

ఆహార పద్ధతి మార్చుకుంటే మంచి ఆరోగ్యాన్ని పొందగలమని గుంటూరు మెడికల్ కాలేజి ఫార్మకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. ఆదివారం అరండల్‌పేట అవగాహన కార్యాలయంలో 'ఆహారమే ఔషధం-సమతుల ఆహారం' అనే అంశంపై జరిగిన ఆరోగ్యసభకు ప్రొఫెసర్ కె.రత్నారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ప్రపంచలో అతిపెద్ద వ్యాపార రంగాలైన మందులు, ఆహర పరిశ్రమలు ప్రజల్ని ఎలా దోపిడి చేస్తున్నాయో తెలిసి కూడా నిస్సహాయ స్థితిలో ఉంటున్నామన్నారు. ధైర్యం చేసి కొంతమంది డాక్టర్లు, సైంటిస్టులు, ఆహార రంగ నిపుణులు నూతన ఆవిష్కరణ విధానాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. ఆట్కిన్ అనే గుండెవైద్య నిపుణుడు డైట్ రెవల్యూషన్ పేరుతో రాసిన పుస్తకం కోట్ల కాపీలు అమ్ముడైందన్నారు. ఆయన సూచించిన ఆహారానికి ప్రాతిపదిక శరీరాన్ని గ్లూకోజ్‌పై ఆధారపడే బదులు, కీటోన్లపై ఆధారపడేలా చేయటమేనన్నారు. విలియం బాంటింగ్ అనే అంగ్లేయుడు అనేక పరిశోధనలు, ప్రయోగాలు చేసి, పిండిపదార్థాలు తగ్గించి, మాంసాహారాలపై ఆధారపడి బరువు తగ్గి, తన అనుభవాలతో 16 పేజిల కరపత్రాన్ని ప్రచురించగా అది విస్తృత ప్రచారం పొందిందన్నారు. ఆధునిక వైద్య పరిశోధనల్లో మాంసకృత్తులకు కూడా ఇన్సులిన్‌ను ప్రేరేపించే లక్షణం ఉండటంతో ఆహార పద్ధతిని సవరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌ను అవగాహన సభ్యులు సన్మానించారు.

సభలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్